


చంద్రన్న కానుకలు (ఫైల్)

- ప్రభుత్వ తీరుతో అన్ని వర్గాలూ ఇబ్బందులు
- రైతులకు చెల్లించని ధాన్యం బిల్లులు
- పేదలకు అందించని టిడ్కో ఇళ్లు
- కాంట్రాక్టర్లకు నిలిచిన బిల్లుల చెల్లింపు
- కానుకలు ఇవ్వకపోవడంతో పిండి వంటలకు దూరమైన నిరుపేదలు
- అంగన్‌వాడీల జీతాల నిలిపివేత

సంక్రాంతి ఏదీ జగనన్నా?


సాలూరులో నిర్మించిన టిడ్కో గృహాలు


కల్లంలోనే ధాన్యం బస్తాలు

పార్వతీపురం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి అంటే పల్లెలే గుర్తుకొస్తాయి. పండగ మూడు రోజులూ గ్రామాల్లో ఎంతో సందడి వాతావరణం నెలకొంటుంది. ముఖ్యంగా రైతులు తమ పంటలు అమ్ముకొని ఆ వచ్చిన డబ్బులతో కుటుంబాలతో ఎంతో ఆనందంగా సంక్రాంతి జరుపుకుంటారు. కానీ, ఈ ఏడాది పల్లెల్లో సంక్రాంతి శోభ కానరావడం లేదు. ప్రభుత్వ తీరుతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో వారంతా పండగ చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు.

ఈ ఏడాది సకాలంలో వర్షాలు లేకపోవడంతో సాగునీటి కోసం జిల్లా రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో రైతులు సాగునీటికి తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షాలపై ఆధారపడిన రైతులకు పూర్తిస్థాయిలో పంటలు చేతికి అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ధాన్యం విక్ర యాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలతో సుదూర ప్రాంతాల్లోని రైస్ మిల్లులకు ధాన్యం తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ నెల 12 వరకు ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లులు అందలేదు. ధాన్యం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో పడకపోవడంతో సంక్రాంతి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఒక బస్తాకు 80 కేజీల ధాన్యం రైతుల నుంచి మిల్లర్లు తీసుకోవాలి. కానీ కొందరు మిల్లర్లు 84 కేజీలు తీసుకుంటుండడంతో రైతులు నష్టపోతున్నారు.

అందని టిడ్కో గృహాలు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల కోసం టిడ్కో గృహాలను నిర్మించారు. అయితే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను పేదలకు అందించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. జిల్లా కేంద్రం పార్వతీపురంలో నిర్మించిన టిడ్కో గృహాల కోసం అప్పులు చేసి కొంత మంది రూ.25 వేలు, మరికొంతమంది రూ.50 వేల చొప్పున చెల్లించారు. కానీ ప్రభుత్వం వారికి ఇళ్ల పంపిణీ చేయడం లేదు. కట్టిన డబ్బులు కూడా తిరిగి చెల్లించడం లేదు. సాలూరు పట్టణంలో ఇళ్ల కొంతవరకు పూర్తయినా అవి ఎప్పుడు అందిస్తారో తెలియని పరిస్థితి.

బిల్లుల కోసం ఎదురుచూపు..

గ్రామాల్లో ప్రభుత్వ ప్రాధాన్య భవనాలను సొంత డబ్బులతో నిర్మించిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో వారు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఈ కాంట్రాక్టర్లలో ఎక్కువ మంది వైసీపీ నాయకులే ఉన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో బిల్లుల చెల్లింపులు జరుగుతాయో లేదోనని మదనప డుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీ మద్దతుదారులైన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా కక్ష సాధింపునకు పాల్పడుతోంది.

కానుకలు ఏవి..

ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని, గడపగడపకూ నాణ్యమైన సరుకు లు అందిస్తామని ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చిన తరువాత ఉన్న పథ కాలను ఎత్తేశారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రతీ సంక్రాంతికి కానుకల పేరిట నిరుపేదలకు ఉచితంగా రేషన్ సరుకులను అందించేది. పిండి వంటలు చేసు కొని ఇంటిల్లాపాది ఆనందంగా పండగా జరుపు కోవాలని కందిపప్పు, శనగపప్పు, వంటనూనె, బెల్లం, గోధుమ పిండి, నెయ్యి ఉచితంగా ఇచ్చేది. కానీ, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ కానుకలకు మంగళం పాడింది. దీంతో నిత్యావసరాలు కొనలేక పండగ పూట పస్తులు ఉండాల్సి వస్తోందని నిరుపేదలు వాపోతున్నారు.

అంగన్‌వాడీల కష్టాలు..

పండగ పూట అంగన్‌వాడీ ఉద్యోగులకు కష్టాలు తప్పడం లేదు. సుమారు 34 రోజులుగా సమ్మె చేస్తుండడంతో ప్రభుత్వం వారికి జీతాలు నిలిపేసింది. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో పండగపూట కూడా రోడ్డెక్కి నిరసన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం

- టీడీపీ, జనసేన నాయకుల పిలుపు
- భోగి మంటల్లో చీకటి జీవోల దహనం


చీకటి జీవో ప్రతులను భోగి మంటలో వేస్తున్న జయకృష్ణ

భామిని, జనవరి 14: రాష్ట్రంలో వైసీపీ పాలనకు చరమగీతం పాడుదామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మల నిబ్రం ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో మండలంలోని సింగిడి గ్రామంలో భోగి సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన చీకటి జీవోలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సాగునీరు అందించేందుకు మండలంలోని వడ్డంగి, మనుమకొండలో లిఫ్ట్ ఇరిగేషన్లు, భామిని కొండలోవగెడ్డ రిజర్వాయర్‌కు అదనంగా రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం రాగానే రైతులకు నీరు లేకుండా చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే కళావతి నాగావళి, వంశధార నదుల నుంచి ఇసుకను దోచుకున్నారని ఆరోపించారు. అలికాం-బత్తిలి రహదారిపై ప్రయాణిస్తే ప్రభుత్వం ఎంత అభివృద్ధి చేసిందో తెలుస్తుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు రవినాయుడు, ఆనందరావు, కిరణ్‌కుమార్, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.


పార్వతీపురంలో జీవో ప్రతులను దహనం చేస్తున్న విజయచంద్ర, తదితరులు

- పార్వతీపురం (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో చీకటి జీవోల ప్రతులను భోగి మంటల్లో టీడీపీ నాయకులు దహనం చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మునిసిపల్ మాజీ చైరపర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి పాల్గొన్నారు.

భోగి సందడి

పార్వతీపురం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు ఆదివారం భోగి పండగను ఘనంగా జరుపుకొన్నారు. ప్రతిఒక్కరూ తలస్నాన మాచరించి భోగి మంట వేశారు. ముందుగా తయారుచేసిన పిడకలను భోగి మంటల్లో వేశారు. సాయంత్రం చిన్నారుల తలపై తల్లి దండ్రులు భోగి పండ్లు పోసి బాలరిష్టాలు పోయి ఆరోగ్యంగా ఉండాలని దీవించారు. రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. వివిధ ఆలయాల్లో గోదాదేవి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా జరిపారు.


పార్వతీపురంలో భోగి మంట వేసిన దృశ్యం

పండగపూట విషాదం

- కూల్‌డ్రింక్ అనుకుని పురుగు మందు తాగిన బాలుడు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


బిలియం (ఫైల్)

సీతంపేట/భామిని, జనవరి 14: భోగి పండగ పూట ఆ ఇంటా తీవ్ర విషాదం నెలకొంది. కూల్‌డ్రింక్ అనుకుని పురుగు మందు తాగడంతో ఓ బాలుడు మృతి చెందాడు. భామిని మండలం బొడ్డగూడకు చెందిన బిడ్డిక బిలియం (12) సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భామిని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఇటీవల పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో తన స్వగ్రామం బొడ్డగూడకు వచ్చాడు. రోజులాగే ఆదివారం ఆడుతూ ఇంటి పెరట్లో కూల్‌డ్రింక్ బాటిల్‌లో వ్యవసాయం నిమిత్తం ఉంచిన పురుగు మందును డ్రింక్ అనుకుని తాగాడు. అయితే, తన ఒంట్లో అదోలా ఉందని బిలియం తన తండ్రికి చెప్పి తాను తాగిన డ్రింక్ బాటిల్‌ను చూపించాడు. దీంతో తండ్రి వెంకటరావు, తల్లి సరోజని కంగారు పడ్డారు. కుమారుడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే భామిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం తీసుకొచ్చారు. డాక్టర్ రాజశేఖర్ విద్యార్థికి చికిత్స అందించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మెను విరమించేది లేదు

- స్పష్టం చేసిన అంగన్‌వాడీలు
- భోగి మంటల్లో జీవో-2 ప్రతుల దహనం
- ప్రభుత్వ తీరుపై మండిపాటు


కలెక్టరేట్ వద్ద భోగి మంటల్లో జీవో-2 ప్రతులను వేస్తున్న అంగన్‌వాడీలు

బెలగాం, జనవరి 14: తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మెను విరమించేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా సమ్మెను కొనసాగిస్తున్నారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్ష ఆదివారానికి 34వ రోజుకు చేరింది. శిబిరం వద్దే భోగి మంటలు వేసి జీవో-2 ప్రతులను దహనం చేశారు. అనంతరం సంక్రాంతి రంగవల్లులు వేసి నిరసన తెలిపారు. మహిళా సాధికారత అంటూ ప్రచారాలు ఊదరగొడుతున్నారే తప్ప మహిళలమైన తమపై సీఎం జగన్మోహన్‌రెడ్డికి కొంచెం కూడా జాలి, దయ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుతో కుటుంబ సభ్యులతో జరుపుకోవాల్సిన పండగలను సమ్మె శిబిరాల వద్ద చేసుకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిస్మస్ ఇక్కడే చేసుకున్నామని, సంక్రాంతి కూడా ఇక్కడే జరుపుకుంటామని చెప్పారు. తమ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చర్చలకు పిలిచి బెదిరింపులకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులకు పైగా నిరసన తెలుపుతున్నా సీఎం జగన్‌కి కనిపించడం లేదు..వినిపించడం లేదని ఎద్దేవా చేశారు. అంగన్‌వాడీలపై సీఎం కర్కషంగా వ్యవహరిస్తున్నారని, సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చిచెప్పారు. తమపై ప్రయోగించిన ఎస్మా చట్టం వెనక్కి తీసుకోవాలని కోరారు. వేతనం పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి వచ్చి సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని, సమ్మె మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సాలూరు గౌరీమణి, మర్రాపు అలివేలు, జి.జ్యోతి స్పష్టం చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పాకల సన్యాసిరావు, గిరిజన సంఘం నాయకులు రంజిత్ సంఘీభావం తెలిపారు.


సీతంపేటలో జీవో 2 ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం


సాలూరు: శిబిరం వద్ద పిండి వంటలు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


గరుగుబిల్లిలో..

నిర్వహణ లేక.. నిప్పంటించి

- చెత్త కుప్పలకు మంట పెడుతున్న వైనం
- ఇదీ బొబ్బిలి మునిసిపాలిటీలో పరిస్థితి



చెత్త కుప్పలకు మంట పెట్టిన దృశ్యం

బొబ్బిలి: బొబ్బిలి మునిసిపాలిటీలోని డంపింగ్ యార్డులో చెత్త నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందన్న విమర్శలొస్తున్నాయి. చెత్తతో సంపద సృష్టించవచ్చని ప్రభుత్వ సూచన ఇక్కడ అమలుకు నోచుకోవడం లేదు. ఒకప్పుడు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును బొబ్బిలి మునిసిపాలిటీ సొంతం చేసుకున్న విషయం విదితమే. ప్రస్తుతం సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేక వీధుల్లో సేకరిస్తున్న చెత్తకుప్పలకు నిప్పంటిస్తుండడం విశేషం. పట్టణంలోని వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయం సమీపంలో గల కృష్ణాపురం రహదారిలో ఉన్న పాత డంపింగ్‌యార్డులో ప్రతిరోజూ చెత్తకు మంటలు పెడుతున్నారు. దీంతో పొగ, వాసనతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ డంపింగ్ యార్డును పూర్తిగా మూసివేసి పర్యావరణపరంగా ఆ స్థలాన్ని వినియోగించుకోవాలని పలు సంఘాల ప్రతినిధులు అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన విషయం విదితమే. చెత్తకు మంట పెట్టకూడదన్న నిబంధన సైతం ఉల్లంఘించి తగలబెట్టడం సరైన పద్ధతికాదని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించాల్సిందిపోయి, ఇలా తగలబెట్టడం ఎంతవరకు సమంజసమని పలువురు పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. కాగా శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరుకు చెత్తకు మంటలు పెట్టవద్దని ఆదేశించామని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

రోడ్డు మధ్యలోనే.. మూడు నెలలుగా

- బొబ్బిలి చర్చి సెంటర్‌లో మట్టిదిబ్బలు
- ప్రయాణికులు, పాదచారులు అవస్థలు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని చర్చి సెంటర్‌లో గల ప్రధాన రహదారి మధ్యలో మూడునెలలుగా మట్టిదిబ్బలు తొలగించకపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు, పాదచారులు అవస్థలకు గురవుతున్నారు. సంక్రాంతి పురస్కరించుకుని కొద్దిరోజులుగా పట్టణానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సరుకులు, దుస్తులు కొనుగోలుకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. చర్చి సెంటర్ మీదుగా ఎక్కువగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఇక్కడ మట్టి దిబ్బలు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. కోర్టుసెంటర్ నుంచి పోలీసు స్టేషన్, ప్రభుత్వాస్పత్రి, కోవల సెంటర్ మీదుగా అమ్మిగారి కోనేరుగట్టు వరకు గల బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు మూడు నెలల కిందట జరిగిన విషయం విదితమే. అప్పట్లో ఆర్‌అండ్‌బీ, మునిసిపల్ అధికారులు రోడ్డు మధ్యలో మట్టి పోగులు వేశారు. ఆ తర్వాత చర్చి సెంటర్‌లో వేసిన మట్టి తొలగించకపోవడంతో చీకటిపడిన తర్వాత వచ్చే వాహనాలు బోల్తాపడుతున్నాయని పలువురు వాపోతున్నారు.కాగా చర్చి సెంటర్‌లో మట్టిదిబ్బలను తొలగించాలని కాంట్రాక్టరుకు తెలియజేసినట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు.



బొబ్బిలి చర్చి సెంటర్‌లో రోడ్డు మధ్యలో మట్టిదిబ్బలు

గొల్లపల్లిలో ధాన్యం కాలిబూడిద



కృష్ణకు ఆర్థికసాయం అందజేస్తున్న బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలిలోని గొల్లపల్లికి చెందిన బొబ్బాది కృష్ణకు చెందిన ధాన్యానికి ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి తగలబెట్టారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొలంలో పండిన పంటను నూర్చి బస్తాల్లో నిల్వచేశాడు. ఇంతలో కుప్పలకు దుండగులు వరిగడ్డి వేసి మంట పెట్టడంతో ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. వంద బస్తాలు నిల్వచేయగా 40 బస్తాలకుపైగా ధాన్యం పూర్తిగా కాలిబూడిదయ్యాయని అధికారులు చెబుతున్నారు. వ్యక్తిగత కక్షలతోనే ఈ దురాగతానికి పాల్పడినట్లు బాధితుడు అనుమానిస్తున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దుర్బుద్ధితో ఎవరో తగలబెట్టారని రైతు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈసమాచారం తెలియగానే మునిసిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, వీఆర్వో సింహాచలం, ఆర్బీకే ప్రతినిధి పుణ్యవతి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పాడైన ధాన్యాన్ని సమీపంలో గల రైసుమిల్లుకు తరలించారు. ఈ అంశాన్ని సివిల్ సప్లయిస్ డీఎం దృష్టికి తీసుకెళ్లామని వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. ధాన్యం మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నా పండుగకావడంతో రవాణాకు సంబంధించిన షెడ్యూల్‌ను రైతు తీసుకోలేదని, పండుగ తర్వాత తరలిద్దామనుకున్నారని, ఇంతలోనే ఈ దారుణం జరిగిందని కృష్ణ వాపోయాడు. కాగా గొల్లపల్లిలో ధాన్యం కాలిపోయిన రైతు కృష్ణను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన ఆదివారం పరామర్శించి ఓదార్చారు. నష్టపోయిన రైతుకు తనవంతుగా ఆర్థికసహాయం చేశారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా కృషిచేస్తానని ఆయన హామీఇచ్చారు. బేబీనాయన వెంట గొల్లపల్లి టీడీపీ నాయకులు పిరిడి ఈశ్వరరావు, కాకల వెంకటరావు, తవిటినాయుడు ఉన్నారు.

నచ్చింది లేదు... ఇచ్చిందే తాగండి

- పండుగ పూట కానరాని పాత బ్రాండ్లు
- మద్యం ప్రియుల ఆందోళన

గజపతినగరం: జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం ప్రియులకు నచ్చిన బ్రాండ్ దొరకడంలేదు. నిర్వాహకులు ఇచ్చిన మద్యం బ్రాండ్లతో సరిపెట్టుకోవల్సివస్తోంది. పండుగ కూడా పాత బ్రాండ్ల మద్యం దొరకడం లేదని, బ్రాండ్ల ముసుగులో చీప్ లిక్కర్ విక్రయిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

మద్యం షాపుల్లో పాత బ్రాండ్లు విక్రయించనున్నట్లు ప్రభుత్వం ఇటీవల పేర్కొన్నా ఎక్కడా కానరావంలేదని మద్యం ప్రియులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణపై వారంతా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గతంలో విక్రయించిన రెగ్యులర్ బ్రాండ్లు ప్రస్తుతం ఎక్కడా దొరకడంలేదని వాపోతున్నారు.ఇప్పటివరకు తాగని, ఎన్నడూచూడని మద్యం బ్రాండ్లు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్నారని, నచ్చిన మందులేదని, ఇచ్చిందే తాగాలని కొందరు నిర్వాహకులు సూచిస్తున్నారు. రోజంతా కూలి పనులు చేసుకొని వచ్చేవారు గతంలో అలవాటైన బ్రాండ్‌పై మొగ్గుచూపుతున్నారు.ఈనేపథ్యంలో తాము ఇచ్చిన మద్యాన్ని తీసుకోవాలని పేర్కొనడంతో తాగాల్సిన దుస్థితి నెలకొందని, దీంతో అనారోగ్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. బ్రాందీ, బీరు, విస్కీ, రమ్ము, వైన్ బార్లు, రెస్టారెంట్లల్లో మాత్రమే లభ్యమవుతున్నాయి. ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన సరుకు మాత్రమే విక్రయించగలమని, మీరుకోరిన బ్రాండ్లను సరఫరా చేయలేమని షాపుల నిర్వాహకులు చెబుతున్నారు.బార్లకువెళ్లి తాగుదామంటే బాటిల్‌పై అదనంగా డబ్బులు చెల్లించుకోవల్సివస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దీంతో మద్యం ప్రియులు ఏదో ఒక బ్రాండ్‌తో సరిపెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత బ్రాండ్ విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మందు బాబులు కోరుతున్నారు.

రేపు శ్రీకృష్ణారాయుడుస్వామి తీర్థమహోత్సవం

వేపాడ:మండలంలోని కృష్ణరాయుడుపేటలో కనుమ పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి శ్రీకృష్ణారాయుడుస్వామి తీర్థ మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు,తీర్థమహోత్సవ నిర్వాహకకమిటీ సభ్యులు ఒకప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగాఉదయం ఐదుగంటల నుంచి గ్రామస్థులు దూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అఖండ దీపారాధన, అభిషేకాలు ప్రత్యేక పూజలతో పాటు స్వామివారికి మొక్కులు తీర్చుకుంటారని పేర్కొన్నారు. సాయంత్రం రెండుగంటల నుంచి ఎడ్ల పరుగుపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జామిలో ట్రాఫిక్ కష్టాలు



జామి ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

జామి:జామిలోని జామి-విజయనగరం ప్రధాన రహదారిలో ఆదివారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రధానంగా కూరగాయాల వ్యాపారులు తమ వ్యాపారం కోసం ప్రధాన రహదారిని ఆక్రమించడంతో పాటు చాలామంది రోడ్డుపైన తమ వాహనాలు పార్కింగ్‌చేసి వెళ్లిపోయారు. దీంతో తర్వాత వచ్చిన వాహనాలు ముందుకు వెళ్లడానికి వీల్లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో పండుగకు గ్రామాలకు బయలదేరిన వారు, వాహనచోదకులు అవస్థలకు గురయ్యారు.

అప్పలనర్సమ్మకు బేబీనాయన పరామర్శ

బాడంగి: స్థానిక ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గుణుపూరు అప్పలనర్సమ్మను బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన ఆదివారం పరామర్శించారు. అప్పలనర్సమ్మ శనివారం ఇంటి వద్ద పడిపోవడంతో కాలు విరిగిపోయింది. దీంతో బేబీనాయన టీడీపీ నాయకుడు గుణుపూరు స్వామినాయుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తెంటు రవిబాబు, మాజీ కౌన్సిలర్ ఏగిరెడ్డి శ్రీధర్, గుణుపూరు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

- రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళి

రాజాం: సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. ఆదివారం రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీని పూర్తిగా ప్రజలు తరమికొట్టేరోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. చంద్రబాబునాయుడును అక్రమంగా ఇరికించి 53 రోజులు జైలులో పెట్టించారని, కోర్టుకు ఎటువంటి ఆధారాలు సమర్పించలేకపోయారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, కిమిడి అశోక్‌కుమార్, మరిపి జగన్మోహన్‌రావు, టంకాల నాగరాజు, పిన్నింటి మోహన్‌రావు పాల్గొన్నారు.● ఆగూరులో మూడువేల మందికి దుప్పట్లు, చీరలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

టీడీపీలో చిన్నయ్యపేటవాసుల చేరిక

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీ చిన్నయ్యపేటలోని వైసీపీకి చెందిన యువకులు టీడీపీలో చేరారు. రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహనరావు ఆధ్వర్యంలో ఆదివారం శ్యాంపురంలో క్యాంపు కార్యాలయంలో వైసీపీ యూత్ ప్రెసిడెంట్ బోర చంద్రశేఖర్ తదితరులు చేరినట్లు రేగిడి మండల టీడీపీ పార్టీ నేతలు దూబ ధర్మారావు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మండల యువత అధ్యక్షుడు మజ్జి శ్రీనవాసరావు, కె.అశోక్‌కుమార్, కర్రి రమణ, గంగు కృష్ణారావు, గురువాన ధనంజయ్‌రావు పాల్గొన్నారు.



రేగిడి: చిన్నయ్యపేట యువతను ఆహ్వానిస్తున్న కోండ్రు మురళి

ప్రమాదకరంగా మలుపులు



ముంజేరు సమీపంలో ఉన్న ఓ మలుపు

భోగాపురం:భోగాపురం నుంచి ముక్కాం, అమటాం రాయవలస నుంచి చేపలకంచేరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారుల్లో మలుపులుప్రమాదకరంగా ఉన్నాయి. భోగాపురంనుంచి ముక్కాం వెళ్లే రహదారిలో సరివలస, ముంజేరు, సచివాలయం, రామచంద్రపేటజంక్షన్, అమటాం రాయవలస నుంచి కంచేరు ఆర్‌అండ్‌బీ రహదారిలో అమటాంరాయవలస, గూడెపువలస, భైరెడ్డిపాలెం తదితర ప్రాంతాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల్లో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలమైన ప్లాట్‌ఫారాలు



కొండ్రాజుపాలెంలో శిథిలమైన ప్లాట్‌ఫారం

భోగాపురం: తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉండేలా నిర్మించిన చేపలు ఆరవేసుకొనే ప్లాట్‌ఫారాలు శిథిలమై నిరుపయోగంగా మారాయి. ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు తదితర గ్రామాల్లో ప్రభుత్వం రూ.43 లక్షలతో 43 ప్లాట్‌ఫారాలు నిర్మించింది. చిన్న చేపలు, కవ్వలు, నెత్తలు, తదితర చేపలను ఆరవేసుకోవడానికి ప్లాట్‌పారాలు ఉపయోగకరంగా ఉంటాయని మత్స్యకారులు సంతోషించారు. వారి సంతోషం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ప్లాట్‌ఫారాలు నిర్మించిన కొద్దికాలానికే శిథిలమయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కొత్త ప్లాట్‌ఫారాలు నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు



ముక్కాం సముద్రతీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

భోగాపురం: ముక్కాం సముద్ర తీరం ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. తీరం వెంబడి సముద్రం అంతా ప్లాస్టిక్, చెత్తా, చెదారంతో దర్శనమిస్తోంది. గ్రామంలో ఉండే చెత్త సముద్రంలోకి కొట్టుకురావడం, తీరంలో పడేయడంతో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. పంచాయతీ వారు స్పందించి తీరం వెంబడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

బట్టికాలువలో దోమల స్వైరవిహారం



గుర్రపుడెక్కతో నిండిన బట్టికాలువ

భోగాపురం: భోగాపురం బట్టి కాలువ వ్యాధులకు నిలయంగా మారింది. ఈ కాలువ బొల్లి వీధి సమీప పాఠశాల నుంచి గంగిరావి చెరువు వరకు సుమారు 12 మీటర్ల వెడల్పుతో కిలోమీటరకుపైగా పొడవు ఉంది. ఇక్కడ దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో అనేక మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఫైలేరియాతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. దీనిలో ఇటీవల కొంతవరకు పూడికతీశారు. అధిక భాగం ఇంకా పూడికతోఉంది. దీంతో దోమలు వృద్ధి చెందుతు న్నాయి. అధికారులు స్పందించి బట్టికాలువ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పారమ్మ పేరంటాలకు పూజలు



పాపమ్మతల్లి సారె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: మండలంలోని నిడుగట్టులో గల పాపమ్మ పేరంటాలకు పాటూరు గ్రామస్థులు పసుపుకుంకుమలతో పాటు సారె, చీర సమర్పించారు. ఆదివారం ఉదయం గ్రామస్థులు పాటూరు రమణమూర్తి ఆధ్వర్యంలో నిడుగట్టు గ్రామానికి సుమారు 35 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. ఎల్.కోట జంక్షన్ వద్ద మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అమ్మవారి సారెను నెత్తిన పెట్టుకొని మోశారు. నిడుగట్టులో అమ్మవారికి పూజలు నిర్వహించి పండగ చేశారు. సుమారు రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి భోగి రోజున పాపమ్మతల్లికి పసుపుకుంకుమలు సమర్పిస్తామని పాటూరు గ్రామస్థులు తెలిపారు.

అభ్యర్థులను మారిస్తే అధికారం రాదు

- టీడీపీ విశాఖ పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు అప్పారావు

కొత్తవలస : అభ్యర్థులను మారిస్తే అధికారం రాదని, ప్రజలు ఆదరిస్తే అధికారం వస్తుందని టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, అధికార ప్రతినిధి కోళ్ల వెంకట రమణ తెలిపారు. ఆది వారం కొత్తవలసలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ నియోజకవర్గాల ఎమ్మెల్యేలను మారిస్తే ఓట్లు రాలవని, చెల్లని రూపాయి ఎక్కడైన చెల్లదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిచేస్తే ప్రజలు ఆదరిస్తారని, అభివృద్ధి లేని వారిని ఎలా ఆదరిస్తారని ప్రశ్నించారు. కనీసం రోడ్లు వేయించలేకపోయారని, ఐదేళ్లపాటు కక్షలు, కబ్జాలతో కాలయాపన చేసిన ముఖ్యమంత్రి తనను చూసి ఓటేయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తనను చూసి ఓటేయడానికి ముఖ్యమంత్రి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని వేయాలా, సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేసిన వారిపై కేసులు పెట్టినందుకు ఓటేయాలా, ప్రభుత్వ ఉద్యోగులు దాచుకున్న సొమ్మును వాడుకున్నందుకు ఓటేయాలా, కనీసం ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేనందుకు ఓటేయాలా అని ప్రశ్నించారు.మద్య నిషేధం చేయకపోతే ఓటే అడగనని చెప్పిన ముఖ్యమంత్రి మళ్లీ ఇప్పుడు ఎలా ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతారన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలను కనీసం తన దరిదాపులకు రానీయకపోతే నియోజకవర్గ సమస్యలను ఎలా చెప్పుకుంటారన్నారు. ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోవడంతో కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, ముఖ్యమంత్రి మాటలను విశ్వసించే స్థితిలో లేరని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎటువంటి తీర్పు వచ్చిందో అదే రకమైన తీర్పును ప్రజలు ఇవ్వ బోతున్నారని తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

భోగాపురం: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి అక్రమంగా తరలిస్తున్న 57 మద్యంసీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేశామని ఎస్ఐ సూర్యకుమారిఆదివారం తెలిపారు. కొండ్రాజుపాలెంజంక్షన్ సమీపంలో కొండ్రాజుపాలెంకు చెందిన మూగి రాము నుంచి 42, దిబ్బలపాలెంకు చెందిన పిట్టా అప్పన్న నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

పెరుమాళిలో 'మన ఊరు-మన ఆట'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన నాయకులు

తెర్లాం: మండలంలోని పెరుమాళి జనసేన నాయకులు రేగాన శంబర పోలయ్య, శ్రీనుల ఆధ్వర్యంలో తెర్లాం మండల జనసేన అధ్యక్షులు మరడాన రవి ఆదివారం మన ఊరు-మన ఆట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జనసేన రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బాబు పాలూరు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ పొత్తును ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలిచిన, పాల్గొన్నవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొబ్బిలి మండల అధ్యక్షులు సంచాన గంగాధర్, టీడీపీ సర్పంచ్ అప్పచ్చు రాజు, వీర మహిళ యందవ యామిని, చందక ఉమామహేష్, ఆర్‌పీ.రాజు, రేగాన సింబు పాల్గొన్నారు.

గోదారంగ నాయకుల కల్యాణం



బొబ్బిలి: కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

బొబ్బిలి: బొబ్బిలి కంచరవీధి కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా ఆదివారం గోదారంగనాయకుల కల్యాణమహోత్సవాన్ని అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింగారపువీధి వైభవవేంకటేశ్వరా లయంలో కూడా కల్యాణ మహోత్సవం జరిగింది. హరిదాసు పాటలు, చిన్నపిల్లలకు భోగిపళ్ల స్నానం చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవ ముగింపు కార్య క్రమాలను నిర్వహించారు.

●**రామభద్రపురం:**మండలంలోని ఆరికతోటలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి పురస్కరించుకొని గోదాదేవి కల్యాణం నిర్వహించారు. పూజారి బాదంపూడి నాగరామలింగేశ్వరశర్మఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. సంక్రాంతి ముందు నెల రోజులు గ్రామంలో మేలుకొలుపు,ఆ తర్వాత భోగిరోజు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో అవినాష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంఘాల సందడి

కొత్తవలస:మండలంలోని పలు గ్రామాల్లో ఏటా సంక్రాంతికి సందడి ప్రారంభమవుతుంది. గ్రామాల్లో వివిధ సామాజికవర్గాల వారీగా సంఘాలను ఏర్పాటుచేసుకుని కొంత సొమ్మును పొదుపు చేసుకుంటారు. ఆ సొమ్మును సంఘ సభ్యులు తమ అవసరాల కోసం మళ్లి స్వల్ప వడ్డీతో రుణాలు తీసుకుంటారు. ప్రతి సంఘంలో కనీసం 50 నుంచి 60 మంది వరకు సభ్యులుగా ఉంటారు. వీరంతా ఒకేసారి రూ.వేయి నుంచి 10 మేలు వరకు కూడుకుంటారు. ఇలా వచ్చిన సొమ్మును వారి సంఘంలో ఉన్న డబ్బు బట్టి స్వల్ప వడ్డీపై రుణం తీసుకుంటారు. ఇలా తీసుకున్న రుణం, వడ్డీ ప్రతి సంవత్సరం భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో జమ చేస్తారు. ఇలా జమచేసిన సొమ్మంతా మళ్లీ సంఘానికి చేరిన వెంటనే తమ అవసరాల కోసం తీసుకుంటారు. మండలంలోని ప్రతి గ్రామంలో పండగ మూడు రోజులు పొదుపుపై చర్చ పండగ వాతావరణంలా జరుగుతుంది. ఎవరైనా సంఘానికి డబ్బులు అనుకున్న సమయానికి వడ్డీతో సహా చెల్లించకపోతే అటువంటి వారిని అనర్హులుగా గుర్తిస్తారు. దీంతో ప్రతిసభ్యుడు తీసుకున్న సొమ్మును తప్పనసరిగా తిరిగి చెల్లిస్తుంటారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రామభద్రపురం:మండలంలోని ఆరికతోటలో ఆదివారం అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులు పంపిణీ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు తాడుతూరు వెంకటరావు ఆధ్వర్యంలో మహిళలు ఇంటింటికి వెళ్లి అక్షింతలు, శ్రీరాములవారి పట్టాభిషేక ఫోటోలను పంపిణీ చేశారు.

ముగ్గుల పోటీ విజేత అనూష

శృంగవరపుకోట: టీడీపీ రాష్ట్రకార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీల్లో లక్కవరపుకో మండలానికి చెందిన ఇమంది అనూష (లక్కవరపుకోట)విజేతగా నిలిచి రూ.20వేలు నగదు బహుమతి సాధించింది.వేపాడ మండలానికి చెందిన చలుమూరి చిట్టితల్లి, జామి మండలానికి చెందిన కటకం జితేంద్రకల్యాణి, కొత్తవలసకు చెందిన కర్రి కల్యాణి, వేపాడకు చెందిన కర్రి గోవర్థిని వరుస బహుమతులు సాధించారు. ఈ మేరకు రెండు నుంచి ఐదుస్థానాలు సాధించి నగదుబహుమతులు అందుకున్నారు. వీరికి టీడీపీ రాష్ట్రకార్యదర్శి గొంప కృష్ణ భార్య రమాదేవి నగదు బహుమతులు అందజేశారు. అలాగే నియోజకవర్గ స్థాయి క్రికెట్‌పోటీల్లో యశ్వంత్-11 ప్రథమ, సింగపూర్ జట్లు ద్వితీయస్థానాల్లో నిలిచాయి. వీరికి ప్రథమ బహుమతికింద రూ.50వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.35వేలు నగదుబహుమతులను గొంప కృష్ణ అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ,మండలస్థాయి టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటల విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అడుగడుగునా గోతులమయం

- జాతీయరహదారిపై భారీ వాహనాలతో మెటీరియల్ తరలింపు
- దెబ్బతిన్న బుడతనాపల్లి, చంద్రంపేట, సిరిపురం రోడ్లు
- వాహనచోదకులకు తప్పని అగచాట్లు

గంట్యాడ: కొటారుబిల్లి కూడలి నుంచి బుడతనాపల్లి వరకూ వెళ్లే సుమారు ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అడుగడుగునా గోతులమయంకావడంతో వాహనచోదకులకు అగచాట్లు తప్పడంలేదు. విశాఖ- రాయపూర్ వరకూ నిర్మిస్తున్న జాతీయరహదారికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద పెద్ద వాహనాలతో మెటీరియల్ తరలించడం వల్ల రహదారులు పూర్తిగా పాడయ్యాయి. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి బుడతనాపల్లి పరిధిలో నుంచి గ్రావెల్, పెణసాం పరిధిలో నుంచి మెటల్ పెద్ద పెద్ద లారీలతో తరలిస్తున్నారు. కొటారుబిల్లి కూడలి నుంచి బుడతనాపల్లి మీదుగా గొడియాడ, కిర్తుబర్తి, పెణసాం, చినమానాపురం, బుడతనాపల్లి, రాజేరు తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు.



గోతులమయమైన సిరిపురం నుంచి చంద్రంపేట వెళ్లే రోడ్డు

రామవరం నుంచి చికలగెడ్డ వరకూ విస్తరించిన రహదారికి చంద్రంపేట, సిరిపురం, కొటారుబిల్లి, గంట్యాడ చెరువుల్లో నుంచి మట్టిని తరలించారు. పెద్ద పెద్ద లారీలతో తరలించడంతో చంద్రంపేట, సిరిపురం గ్రామాల రహదారి కూడా దెబ్బతింది. గోతులు ఉన్న చోట ఆటో డ్రైవర్లు మట్టిని వేసి కప్పుకున్నారు.

పల్లెల్లో పండగ సందడి

- బంధు మిత్రులతో కళకళలాడుతున్న గ్రామాలు
- వైభవంగా భోగి

పల్లెల్లో పండగ సందడి నెలకొంది. దూర ప్రాంతాల్లో ఉన్నవారంతా స్వగ్రామాలకు వచ్చి చేరారు. సంక్రాంతి మూడు రోజుల్లో మొదటి రోజైన భోగి పండగను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో వేకువజామున పెద్దఎత్తున భోగి మంటలు వేశారు. పిల్లలు, పెద్దలు.. వాటిలో భోగి పిడకలు, వంటచెరకు వేసి, నమస్కరించారు. తలంటు స్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించారు. సాయంత్రం చిన్నారులపై భోగిపళ్లు పోశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


నెల్లిమర్ల: రామతీర్థంలో భోగి మంటలు వేస్తున్న దృశ్యం


సాలూరు: రామా కాలనీలో గగ్గిరెద్దుల సందడి


కురుపాం రూరల్: భోగి మంటల్లో పిడకలు వేస్తున్న దృశ్యం


సాలూరు రూరల్: చిన్నారులకు భోగిపండ్లు వేస్తున్న మహిళలు


భామిని: భోగి మంటలో పిడకలు వేస్తున్న దృశ్యం


సీతంపేట: కొత్త పనుకువలస సమీపంలో..


గరుగుబిల్లి: రావివలసలో భోగి మంటలు వేస్తున్న గ్రామస్థులు


డెంకాడలో..

రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలి

- టీడీపీ ఆధ్వర్యంలో 'భోగి సంకల్పం'

వైసీపీ రూపంలో రాష్ట్రానికి పట్టిన కీడు తొలగిపోవాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు భోగి సంకల్పం పేరుతో ఆదివారం భోగి మంటల్లో వివిధ ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను దహనం చేశారు. ● **గరుగుబిల్లి:** భోగి సంకల్పం, స్వర్ణాంధ్రకు సత్సంకల్పం అనే నినాదాలతో ఆదివారం భోగి మంటల్లో వివిధ ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను టీడీపీ నాయకులు దహనం చేశారు. నాగూరులో పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, రావివలస ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్, చిలకాంలో అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ గౌరమ్మల ఆధ్వర్యంలో ఏపీకి పట్టిన కీడు తొలగాలని సంకల్పం నిర్వహించారు. రాష్ట్రంలోని సమస్యల ఫొటోలను, పత్రాలను భోగి మంటల్లో వేసి నినాదాలు చేశారు. టీడీపీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** భోగి సంకల్పం ద్వారా రాష్ట్రానికి వైసీపీ కీడు తొలగాలని టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయిక జగదీశ్వరి అన్నారు. తాడికొండ గ్రామంలో భోగి మంటల్లో రాష్ట్ర సమస్యల ఫొటోలను, పత్రాలను, ప్లకార్డులను వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: నాగూరులో సంకల్పం నిర్వహిస్తున్న టీడీపీ ప్రతినిధులు, గుమ్మలక్ష్మీపురం: భోగి మంటల వద్ద నిరసన తెలుపుతున్న జగదీశ్వరి

భూ హక్కుల చట్టం జీవో కాపీల దహనం

పాలకొండ: కొండాపురం గ్రామంలో ఆదివారం భూ హక్కుల చట్టం-2022 కాపీలను వివిధ రైతు సంఘాల నాయకులు భోగి మంటల్లో వేసి, నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్య దర్శి బుడితి అప్పలనాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తినాయుడు, గ్రామ అధ్యక్షుడు బలగ దుర్గారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


భూ హక్కుల చట్టం కాపీలను భోగి మంటల్లో వేస్తున్న దృశ్యం

ప్రకృతి సాగుపై పాఠ్యాంశాల తయారీ

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి 1వ తరగతి చిన్నారులకు గేయాల రూపంలో పాఠ్యాంశాల తయారీపై దృష్టి సారిస్తున్నామని ఆర్‌వైఎస్ఎస్ సీనియర్ కన్సల్టెంట్ డా.డి.పారినాయుడు తెలిపారు. తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో రచయితలతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అనుగుణంగా అక్టోబరు నుంచి డిసెంబరు నెల వరకు పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా రూపొందించిన పాఠ్యాంశాలతో బాలలకు ఎంతగానో అవగాహన కలుగుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బి.భీమేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు టి.శివకేశవరావు, కె.దాలినాయుడు, ఆర్.వాసుదేవరావు, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణారావు, పి.రవీంద్రనాథ్, బీవీ పట్నాయక్, టి.శివాజీ, వి.సన్యాసిరావు, డి.నవజీవన్, ఎం.నూకంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పారినాయుడు

రాష్ట్రపతితో అయోధ్య రామాలయాన్ని ప్రారంభించాలి

పాలకొండ: అయోధ్య రామమందిరాన్ని రాష్ట్రపతితో ప్రారంభించాలని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫారం అధ్యక్షుడు బత్తిన మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని మోదీ దళిత, గిరిజనుల పట్ల వ్యతిరేక విధానాలకు అవలంబిస్తున్నారని ఆయన విమర్శించారు.

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు

- గోతుల రహదారికి తాత్కాలిక మరమ్మతులు

గరుగుబిల్లి: పార్వతీపురం శివారు నుంచి ఉల్లిభద్ర, అడ్డాపుశీల, సుంకి, బోటు షికారు, తోటపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గోతులమయం అయ్యింది. పండగను దృష్టిలో పెట్టుకుని ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టే పనిలో పడ్డారు. ఈ రహదారి సమస్య ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ఆర్‌అండ్‌బీ జేఈ పి.ప్రమీల చెప్పా రు. ప్రమాదాలు నెలకొనకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం ఉల్లిభద్ర వరకు పనులు నిర్వహిస్తున్నామని, ఆ తర్వాత సుంకి, తోటపల్లి ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు.


ఉల్లిభద్ర ప్రధాన రహదారికి మరమ్మతులు చేపడుతున్న దృశ్యం


నేడు ప్రధానమంత్రి వర్చువల్ కాన్ఫరెన్స్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పీఎం జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ సోమవారం వర్చువల్ కాన్ఫరెన్స్ విధానంలో పీవీటీజీలతో మాట్లాడనున్నారు. అన్ని ఐటీడీఏల పరిధిలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర న్యాయ శాఖామంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ సీతంపేట ఐటీడీఏ నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది.

ముగిసిన యోగా పోటీలు

ఒడిశా

రాయగడ: నేటి యాంత్రిక జీవితంలో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు యోగా, వ్యాయామం తప్పనిసరిగా అలవాటు చేసుకుంటే ఆరోగ్యంతో పాటు ఆనందం లభిస్తుందని వక్తలు అన్నారు. పట్టణ కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ వ్యాయామ, యోగా పోటీలు శనివారం రాత్రి ముగిసాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో రాష్ట్ర మంత్రి జరగన్నాథ సారక, శాసన సభ్యుడు మకరంద మదిలి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల కలయిక

సీతానగరం: బూర్జ ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వద్ద కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.


పూర్వ విద్యార్థుల సందడి

భోగి మంటల్లో ఎస్మా జీవో ప్రతులు

- 34వ రోజుకు అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 34వ రోజుకు చేరుకుంది. అయితే ఆదివారం భోగి పండగ సందర్భంగా వేసిన భోగి మంటల్లో ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. డిమాండ్లను నెరవేర్చేంతవరకు ఉద్యమాన్ని విరమించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


పాలకొండ: ఎస్మా జీవోను భోగి మంటల్లో వేస్తున్న దృశ్యం


కురుపాం: భోగి మంటల్లో ఎస్మా చట్టం కాపీలు దహనం చేస్తున్న దృశ్యం


సాలూరు రూరల్: మామిడిపల్లిలో జీవో ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న దృశ్యం


గుమ్మలక్ష్మీపురంలో..


కొమరాడలో..

వైభవంగా గోదాదేవి కల్యాణం

ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆదివారం భోగి పండగను పురస్కరించుకుని జిల్లాలోని పలు దేవాలయాల్లో గోదాదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


పాలకొండలో..


కురుపాం రూరల్: మొండెంఖల్‌లో..


గరుగుబిల్లి: తోటపల్లి దేవస్థానంలో గోదాదేవి కల్యాణాన్ని తిలకిస్తున్న గోవింద మాలధారులు


సాలూరు రూరల్: పెదకోమటిపేట రామాలయంలో..